www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 19 జూన్ 2023

5

కాకినాడ

నేడు డయల్ యువర్ కలెక్టర్

ప్రజాశక్తి-కాకినాడ

సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్ 18004253077కు ఫోన్ చేసి జిల్లా కలెక్టర్‌కు తెలియజేయవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకార కార్యక్రమం యథాతథంగా ఉదయం 10.30 గంటల నుంచి జరుగుతుందని అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు.

భారంగా పశు బీమా ప్రీమియం

- పశు బీమా పథకంలో మార్పులు
- ప్రీమియం భారాన్ని మోపేందుకు చర్యలు
- గగ్గోలు పెడుతున్న ల పశుపోషకులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వం పాడి పరిశ్రమను పూర్తిగా విస్మరిస్తోందని విమర్శలు వస్తున్నాయి. పాడి రైతుల సమస్యలను పక్కన పెట్టిందని రైతులు వాపోతున్నారు. పాడి పథకాలను ఒక్కొక్కటీ దూరం చేస్తోందంటున్నారు. తాజాగా పశు బీమా పథకంలో మార్పులు తీసుకొచ్చేందుకు ఈ పథకాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి దీన్ని తిరిగి అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రీమియం భారాన్ని రైతులపై మోపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కాకినాడ జిల్లాలో 76, 502 ఆవులు, 2,82,273 గేదెలు, 1,01,870 గొర్రెలు, 1,41,229 మేకలు ఉన్నాయి. ప్రభుత్వ తీరుతో గతంతో పోల్చుకుంటే జిల్లాలో పాడి పరిశ్రమ గణనీయంగా తగ్గిపోయింది. పాడి పరిశ్రమను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం గతంలో అమలు చేసిన వివిధ పథకాలు ఒక్కొక్కటి దూరమవుతున్నాయి వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు అన్ని పథకాలు చతికిలపడ్డాయి. దీంతో పట్టణ ప్రాంతాల్లో 95 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న 80 శాతానికి పైగా ప్రజలు ప్యాకెట్ పాలు కొనుగోలు చేసుకుంటున్నారు.

నిలిచిన పథకాలు

గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ఊరూరా పశ గ్రాసం పథకం వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా నిలిపివేశారు. గతంలో ఎకరా కౌలు భూమికి రూ.25 వేలతో పాటు పచ్చగడ్డి పెంచుకోవడానికి, ఎరువులకు మరో రూ.20 వేలు ఇచ్చేవారు. గతంలో కిలో రూ.2 చొప్పున పాతర్ల గడ్డి పంపిణీ చేసేవారు. ఈ గడ్డిలో పోషకాలు ఎక్కువగా ఉండడంతో పాల ఉత్పత్తి గణనీయంగా పెరిగేది. పశువులు కూడా ఈ గడ్డిని ఇష్టంగా తినేవి. వైసిపి అధికారంలోకి వచ్చిన మొదట్లో ఈ పథకాన్ని అమలు చేసినా కొంతకాలానికి సరఫరా నిలిపివేశారు. కొందరు పాల సేకరించే నిర్వాహకులు రూ.5కు విక్రయిస్తున్నప్పటికీ రైతులు బయట మార్కెట్లో దాణాను కొనుగోలు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వం హయాంలో పశువులకు నీడకోసం షెడ్లు, పశువులు తాగునీటి తొట్టి, మేత తొట్టిలను నిర్మించుకున్నారు. పశువుల సంఖ్యకు తగ్గట్టు యూనిట్ విలువ రూ.లక్ష నుంచి రూ.1.8 లక్షల వరకు నిర్ణయించడంతో పలువురు రైతులు గోకులాలను నిర్మించుకున్నారు. ఇందులో ప్రభుత్వ వాటా 90 శాతం కాగా రైతు 10 శాతం నిధులు భరించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించుకున్న గోకులాలకు ఇంకా సుమారు రూ.2 కోట్లు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. వైసిపి హయాంలో మినీ గోకులాల నిర్మాణాలను పూర్తిగా విస్మరించారు. దీంతో పశువులకు నీడ కరువైంది.

నిలిచిన పశు బీమా పథకం

ఏదైనా పశువు చనిపోతే వైయస్సార్ పశు నష్ట నివారణ పథకంలో భాగంగా రూ.30 వేలు వరకూ పరిహారంగా అందజేస్తారు. జిల్లాలో 763 మంది రైతులకు చెందిన ఆవులు, గేదెలు, గొర్రెలకు సంబంధించి ఇంకా రూ.2 కోట్లు పైనే పరిహారం రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి మార్పులు తీసుకొచ్చి అమలు చేయాలని తాజాగా ప్రభుత్వం ఈ పథకానికి బ్రేకులు వేశారు. అయితే ఏ విధంగా అమలు చేస్తారనే విధివిధానాలు జిల్లా అధికారులకు చేరలేదు. అంతవరకు పాత క్లెయిములను నిలిపివేయాలని ప్రభుత్వం జిల్లా అధికారులకు సూచించినట్లు సమాచారం. దీంతో కొత్త మార్గదర్శకాల ప్రకారం కొంత ప్రీమియం భారం రైతులపై పడే అవకాశం ఉందని తెలుస్తోంది.

మేలు చేసేందుకే మార్పులు

వైయస్సార్ పశు నష్ట నివారణ పథకం ఎక్కడా నిలిచిపోలేదు. ఇప్పటివరకు ఏ రకం పశువు చనిపోయినా రూ.30 వేలు మాత్రమే బీమా వర్తించేది. ఇకనుంచి రైతులకు ఎక్కువ బీమా వర్తించే విధంగా మరింత మేలు చేసేందుకు మార్గదర్శకాలను రూపొందించనుంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన దాణా సరఫరా చేస్తున్నాం.

- సూర్య ప్రకాశరావు,జేడీ, పశు సంవర్ధక శాఖ

యువతను ఓట్ల కోసం వాడుకుంటున్నారు

కాకినాడ సభలో పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, కాకినాడ రూరల్

ప్రస్తుత రాజకీయ పార్టీలు యువతను ఓట్లు కోసం వాడుకుంటున్నాయని, వాళ్ళ భవిష్యత్తు కోసం జనసేన పార్టీ పుట్టిందని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. వారాహి విజయ యాత్రలో భాగంగా ఆయన ఆదివారం సాయంత్రం కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. కాకినాడ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారంటూ విరుచుకుపడ్డారు. గుండాగిరీ చేస్తున్నారని, బియ్యం ఎగుమతుల్లో రూ.15 వేల కోట్లు దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు.

ప్రస్తుతం రాష్ట్రంలో క్రిమినల్ రాజకీయ నాయకులు పాలిస్తున్నారన్నారు. 2009 నుంచి రాజకీయల్లో ఉండి ఉంటే ఇలాంటి క్రిమినల్ పార్టీ వైసిపికి అధికారం రాకుండా చూసుకొనే వాడినన్నారు. ద్వారంపూడి ఇంట్లోని అందరూ గూండాలని తెలిసిందన్నారు. అతని కుటుంబ సభ్యులకు గతంలో బేడీలు వేశారన్నారు. కాకినాడలో కాపు మహిళలను కాపు రౌడీలతో కొట్టించారన్నారు. కుల దూషణతో రెచ్చగొడితే మర్యాదగా ఉండదని హెచ్చరించారు. కులాన్ని వాడుకుని నాయకులే ఎదుగుతున్నారన్నారు. ద్వారంపూడి గూండాలకు కాకినాడలో నిలబడి హెచ్చరిస్తున్నా.. నాకు అవకాశం వస్తే ఈ గూండాలను తన్నుకుంటూ తీసుకెళ్తా అన్నారు. రౌడీ, గూండా ద్వారంపూడిని ఈసారి గెలవకుండా చూస్తానని తెలిపారు.

ద్వారంపూడి కనుసన్నల్లోనే కాకినాడ పోర్ట్ నుంచి 56 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం రవాణా అవుతోందని ఆరోపించారు.

సభలకు హాజరైన జనం, ప్రసంగిస్తున్న పవన్ కల్యాణ్ (ఇన్‌సెట్‌లో..)

ఉభయ గోదావరి జిల్లాల్లో ఏ గుండాను గెలవనివ్వనని హెచ్చరించారు. శనివారం కాకినాడలో జరిగిన జనవాణిలో అనేక కబ్జా అంశాలు నా దష్టికి వచ్చాయన్నారు. ద్వారంపూడి అనుచరులు పిఠాపురంలో తుపాకీ తీసుకొచ్చి మట్టి తోలుతున్నారన్నారు. వైసిపి ఎంఎల్‌సి ఒక డ్రైవర్‌ను చంపి ఇంటికి డోర్ డెలివరీ చేస్తే మీకు కోపం రావడం లేదా అని ప్రశ్నించారు. యువత కులాన్ని దాటి చూడకపోతే రాష్ట్రం సర్వనాశనం అయిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర హీరోల అభిమానులు కూడా తనకు అండగా నిలవాలని కోరారు. 'దయచేసి జనసేనకు మద్దతు ఇవ్వండి. భవిష్యత్తు కోసం ముందడుగు వెయ్యండి' అని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

వడగాడ్పుల మధ్యే బడులు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

తీవ్రమైన ఎండలు.. భయపెడుతున్న వడగాల్పులు మధ్య జిల్లాలో సోమవారం నుంచి పాఠశాలలు పున్నప్రారంభం కానున్నాయి. ఎండల నేపథ్యంలో వేసవి సెలవులను పొడిగించాలని విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి చేసినప్పటికీ, ప్రభుత్వం పున్నప్రారంభానికే మొగ్గు చూపింది. అయితే వారం రోజుల పాటు ఒంటిపూట బడులు నిర్వహించేలా ఉత్తర్వులు విడుదల చేసింది. దీంతో ఉదయం 7.30 గంటల నుంచి 12 గంటల వరకు పాఠశాలలు పని చేస్తున్నాయి. ఆ సమయంలో విద్యార్థులను ఇళ్లకు పంపితే వడదెబ్బకు గురయ్యే ప్రమాదముందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సోమవారం నుంచి పాఠశాలలు పున్న ప్రారంభం అయ్యాయి. నాలుగు రోజులుగా పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఎండల నేపథ్యంలో ఈ నెల 17వ తేదీ వరకు ఒంటిపూట బడులు నిర్వహించాలని పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఆదేశించారు. ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు తరగతులు నిర్వహించాలని, 12 గంటలలోగా మధ్యాహ్న భోజనం అందించి, విద్యార్థులను ఇళ్లకు పంపాలని సూచించారు. ప్రస్తుతం ఉదయం నుంచే ఎండ తీవ్రత, గాడ్పులు కొనసాగుతుండడంతో 12 గంటల సమయంలో విద్యార్థులు ఇళ్లకు వెళ్లడం శ్రేయస్కరం కాదని టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో పిల్లలకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఇళ్లకు చేరే క్రమంలో వడదెబ్బతో అస్వస్థతకు గురైతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.

ఎండల్లోనే స్కూళ్లకు వస్తున్న విద్యార్థులు

సిఎం ఉదాసీనత వల్లే దారుణాలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సిఎం వైఎస్.జగన్ ఉదాసీనత వల్లే రాష్ట్రంలో విచ్చలవిడిగా దారుణాలు జరుగుతున్నాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి విమర్శించారు. బాపట్ల జిల్లా ఉప్పలవారిపాలెంలో విద్యార్థి ఉప్పాల అమర్నాథ్ సజీవ దహనం ఘటనకు ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వంలో తామేం చేసినా ఎవరూ ఏం చేయలేరు అన్న ధీమాతో వైసిపి గుండాలు రెచ్చిపోతున్నారన్నారు. రాష్ట్రంలో పిచ్చి మద్యం, విచ్చలవిడిగా దొరుకుతున్న గంజాయితో నేరాలు ఘోరాలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా మహిళలపై అత్యాచారాలు, ప్రశ్నించిన వారిపై హత్యలకు తెగబడుతున్నారని విమర్శించారు. తన సోదరి వెంట పడొద్దు అన్న పాపానికి ముక్కుపచ్చలారని బడి పిల్లాడిని క్రూరంగా హత్య చేశారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంతగా దిగజారాయో అర్థం అవుతుందన్నారు. బాధితులకు న్యాయం చేయాల్సిన పోలీసులు నేరం చేసిన అధికార వైసిపి నేతలు వత్తాసు పలకడం బాధాకరం అన్నారు. బిసిలపై ప్రభుత్వంలో రోజురోజుకి దాడులు పెరిగిపోతున్నాయని, ఇటువంటి చర్యలు పునరావతం కాకుండా అరికట్టడానికి తమ నాయకుడు చంద్రబాబు అధికారం లోకి వచ్చిన వెంటనే బిసిల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురానున్నరని తెలిపా3రు. బాధితుల కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి సత్యనారాయణ

'రాజకీయ పచ్చడిలో రుచులన్నీ తెలుసు'

ప్రజాశక్తి-కాకినాడ

రాజకీయ ఉగాది పచ్చడిలో రుచులన్ని తనకు తెలుసని కాకినాడ నగర ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక డి.కన్వెన్షన్ హాల్లో విలేకరులతో మాట్లాడారు. తన రాజకీయ జీవితం తెరచిన పుస్తకం అన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లా పర్యటనలో కత్తిపూడిలో, పిఠాపురంలో తనపై చేసిన ఆరోపణలకు బదులిచారు. తాను కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పైకొచ్చి రెండుసార్లు ఎంఎల్ఎ అయిన విషయం గుర్తు చేశారు. తనను నమ్మిన ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. తన మీద జనసేన అధ్యక్షుడు, నాయకులు లేనిపోని నిందలు వేస్తే తగ్గేది లేదన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ద్వారంపూడి

బచ్చు ఫౌండేషన్ పాఠశాలలో సిబిఎస్ఇ

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట ఆయోధ్యరామపురం బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది నుంచి 9వ తరగతిలో సిబిఎస్ఇ సిలబస్‌కు అనుమతి లభించిందని హెచ్‌ఎం తోటకూర సాయి రామకష్ణ తెలిపారు. తమ స్కూల్‌కు డిజిటల్ క్లాస్ రూములు మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచర్లు జి.గోవిందు, కె.అరుణ, కెవివి.సత్యనారాయణ, వి.రాజు, ఎల్‌వి.కుమారి, కమిటీ సభ్యులు దాసరి రామాంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం పాల్గొన్నారు.

కొండపల్లి శ్రీనుకు పలువురి అభినందన

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా మండలంలోని వేట్లపాలెం గ్రామానికి చెందిన జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆదివారం కాకినాడ రాయల్ పార్క్‌లో ద్వారంపూడి భాస్కర రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తనను సహాయ కార్యదర్శిగా ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా శ్రీనును భాస్కర రెడ్డిని తదితరులు అభినందించారు.

కళారూపాల శిక్షణా శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

సిపిఎం నాయకుడు, ప్రజా కవి యాసలపు సూర్యారావు 11వ వర్ధంతి సందర్భంగా నాలుగు రోజులపాటు పెద్దాపురంలో నిర్వహించే సంతాప కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం యాసలపు సూర్యారావు భవనంలో కళారూపాల శిక్షణా శిబిరం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముందు యాసలపు సూర్యారావు చిత్రపటానికి సీనియర్ ప్రజానాట్యమండలి కళాకారులు దారపురెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా నాట్యమండలి కళాకారులు సిరపరపు బంగార్రాజు, కూనిరెడ్డి రవికుమార్ ఆధ్వర్యంలో పలు కళారూపాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి మండల అధ్యక్ష, కార్యదర్శులు మంతెన సత్తిబాబు, రొంగల వీర్రాజు, దారపురెడ్డి కష్ణ, శ్రావిక, నమ్రత, పూజిత, మంజుల, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

రైతాంగానికి అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఇటీవల దాళ్వాలో నీటి ఎద్దడితో రైతాంగం నానా ఇబ్బందులూ పడి పండించిన పంట అకాల వర్షాలతో మునిగిపోతే నేటికీ ప్రభుత్వం పంట నష్టపరిహారం ఇవ్వలేదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి అన్నారు. తాళ్లరేవు లయన్స్ క్లబ్ హాలులో ముమ్మిడివరం నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు ధూళిపూడి బాబీ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో సాయి మాట్లాడారు. అంతేకాక పండించిన బస్తాకు 3 నుంచి 7 కేజీల వరకు కోత విధించారని, ట్రావెలింగ్ చార్జెస్ ఇవ్వలేదని తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు ఈ నెల 26వ తేదీన నష్టం జరిగిన రైతుల జాబితాలతో ఆయా జిల్లా కలెక్టర్‌లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు ద్వారా రైతులకు స్వయంగా పరిహారం అందజేస్తామని స్పష్టం చేశారు. రైతు నాయకులు కొత్తూరు కాశీ ఈశ్వరుడు, మందాల గంగ సూర్య నారాయణ మాట్లాడారు. ధాన్యం తూసిన వెంటనే రైతుకు డబ్బులు ఖాతాలో వేయకుండా రైతాంగం డబ్బులతో ప్రభుత్వం పబ్బం గడుపుకోవడం సిగ్గు చేటన్నారు. ఆక్వా రైతుకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. కనీసం 100 కౌంట్ రొయ్యలకు కూడా మద్దతు ధర ఇవ్వలేక పోతోందని విమర్శించారు. రేపల్లె నియోజకవర్గం చెరుకూరు మండలం రాజోలు గ్రామంలో వెనుకబడిన వర్గానికి చెందిన బాలునిపై పెట్రోలు పోసి హత్య చేయడం దారుణమన్నారు. ఈ ప్రభుత్వంలో మహిళలకు, యువకులకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. దీనిపై తాళ్లరేవు జూనియర్ కళాశాల వద్ద సోమవారం పెద్ద ఎత్తున ధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు అందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాడ్రేవు వీరబాబు, పిల్లి సత్తిబాబు, టేకుమూడి లక్ష్మణరావు, కుడుపూడి రామకష్ణ, దాసరి వేణుగోపాల్, చక్రవర్తి, వీరన్న యాదవ్, దెయ్యాల జానీ, ఉమాదేవి, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

రైల్వే ట్రైన్ గార్డ్‌లకు ఘన సత్కారం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట రైల్వే స్టేషన్‌లో పని చేస్తున్న ఆరుగురు సిబ్బందికి రైల్వే గూడ్స్ గార్డ్‌లుగా పదోన్నతులు కల్పించడంతో వారిని ఆదివారం రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వారికి 50 రోజుల ట్రైనింగ్ నిమిత్తం సికింద్రాబాద్‌లోని జోనల్ రైల్వే ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు ఈ రోజు రిలీఫ్ మెమోలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రైల్వే ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కెవి.గిరి, స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీధర్, ఆనంతలక్ష్మి, చీఫ్ రిజర్వేషన్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఆర్‌పిఎఫ్ ఎస్ఐ రామకృష్ణ, టికెట్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బుకింగ్ సిబ్బంది, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సెకండ్ ఎంఇఒగా పుల్లయ్య

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట మండలంలో రెండో ఎంఇఒగా పి.పుల్లయ్య నియమితులయ్యారు. ఆదివారం రాత్రి ఈ విషయాన్ని సామర్లకోట ఎంఇఒ వై.శివరామ కష్ణయ్య చెప్పారు. పుల్లయ్య సర్పవరం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా పని చేస్తున్నారని, సోమవారం ఆయన రెండో ఎంఇఒగా బాధ్యతలు తీసుకుంటారని చెప్పారు.

కార్టూ'నిజం'

నేరగాళ్ల స్వైరవిహారం

ప్రగతిలో ప్లేస్‌మెంట్ డే-2023

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ప్లేస్మెంట్ డే-2023 వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటుడు సినీ దర్శకులు మరియు రచయిత తనికెళ్ళ భరణి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని 2023 వ సంవత్సరంలో బి.టెక్ పూర్తి చేసుకుని ఉద్యోగాలు సాధించిన 1170 కి పైగా విద్యార్థినీ, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించడానికి నిర్వహిస్తున్నట్టు కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కష్ణారావు తెలిపారు. 2001 నుంచి ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో నిరంతరం కళాశాల ప్రాంగణ ఎంపికల ద్వారా ఉద్యోగ కల్పనలో పురోగతిని సాధిస్తూ, విద్యార్థులలో భవిష్యత్తు పట్ల ఆశ పెంపొందించే విధంగా ఎన్నో ఉత్తమ బహుళజాతి సంస్థలైన అమెజాన్, సిస్కో, ఫ్లిప్కార్ట్ టిసిఎస్ వంటి కంపెనీల్లో అత్యుత్తమ ప్యాకేజీలతో ఉద్యోగ నియామకాలు పొందారని తెలిపారు. అంతేకాక వివిధ బహుళజాతి సంస్థలైన టెక్-మహీంద్రా, యాక్సెంచర్ హెక్సావేర్, హుండాయ్ ఆర్ అండ్ డి, డిలాయిట్, డిఎక్స్‌సి, ఇన్ఫోసిస్, మోవేట్‌లో సగటు వార్షికాదాయం 3.76 ఎల్‌పిఎతో ఉద్యోగ నియామకాలు పొందారని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి, తనికెళ్ళ భరణి మాట్లాడుతూ, 1170 కి పైగా ఉద్యోగాలు సాధించడం ఎంతో మంచి విషయం అన్నార్ను.ఉద్యోగాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను, వారి అభివృద్ధికి కృషి చేసిన కళాశాల మేనేజ్మెంట్ మరియు కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ విభాగం వారిని అభినందించారు. ఇంత మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంలో గురువు యొక్క పాత్ర మరియు కృషిని తెలియజేస్తూ, యువత నేటి సమాజంలో ఎలా బతకాలో వివరించారు. విద్యార్థుల ఉన్నతికి పాటుపడిన గురువులను గౌరవించవలసిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు.ఉద్యోగాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులు, కళాశాల పూర్వ విద్యార్థులుగా తమ జూనియర్ విద్యార్థుల కళాశాల ప్రాంగణ ఎంపికలలో విజయం సాధించడానికి అవసరమైన సూచనలు అందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డా పరుచూరి కష్ణారావు మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ బహుళజాతి సంస్థలు మరియు వివిధ మల్టీనేషనల్ కంపెనీలు తమ కళాశాల విద్యార్థుల పట్ల నమ్మకాన్ని ఉంచినందుకు సంతోషిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ మేనేజ్మెంట్ ఎంవి.హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరక్టర్ డాక్టర్ ఎస్.శంభు ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.నరేష్, డీన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎం.రాధికామణి, మేనేజర్ కార్పోరేట్ రిలేషన్స్ పి.నాగేంద్రరావు పాల్గొన్నారు.

తనికెళ్ల భరణిని సత్కరిస్తున్న యాజమాన్యం

'పవన్ కల్యాణ్ గౌరవం కాపాడుకోవాలి'

ప్రజాశక్తి-కాకినాడ

జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అంటే తమకు గౌరవం ఉందని, చెప్పుడు మాటలు విని ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై అనవసర ఆరోపణలు మానుకోవాలని పలువురు కాపు నాయకులు పవన్‌కు హితవు చెప్పారు. స్థానిక డి కన్వెన్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పలువురు కాపు నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా నగర మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న మాట్లాడారు. ఈ జిల్లాలో జరిగిన ప్రతి జనసేన బహిరంగ సభలో నగర ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. పార్టీ జెండా, అజెండా లేని పార్టీ జనసేన అని, అటువంటి వారు చంద్రశేఖర్ రెడ్డిని విమర్శిస్తే తమ నాయకుడదిని కాపాడుకోవడానికి ఎంతవరకైనా అడ్డుపడతామని తెలిపారు. కూడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి మాట్లాడుతూ, వైసిపి ముమ్మాటికీ కాపులకు అండగా ఉంటోందని, ముఖ్యంగా చంద్రశేఖర్ రెడ్డి కాకినాడలో కాపులకు అండగా ఉండి, వివిధ కమిటీల్లో పదవులు ఇచ్చారని స్పష్టం చేశారు. కాపు కళ్యాణ మండపానికి రూ.70 లక్షలు మంజూరు చేసిన ఘనత చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీ వంగా గీతకు చెందుతుందని తెలిపారు. ఈ సమావేశంలో దుగ్గిన నాగరాజు, ఇనుకొండ పట్టాభిరామయ్య, పుప్పాల చిన్న, ముమ్మిడి గోవింద్, బెండా విష్ణుమూర్తి, కష్ణ ప్రియ, రాజారపు కష్ణ, దవులూరి రామకష్ణ, పసుపులేటి చంద్రశేఖర్, జేడీ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నేరాలు ఘోరాలు

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఒక చెందిన మహిళ అదృశ్యమైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని గ్రామం, గ్రామానికి చెందిన పి.దుర్గాదేవి ఈ నెల 16న తన ఇంటి వద్ద నుంచి బయటకు వెళ్లి సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద చుట్టుపక్కల గ్రామాలు వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆదివారం దుర్గాదేవి భర్త పోలీసులు ఫిర్యాదు చేశారు.

గోదావరి మునిగి యువకుడి మృతి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

గోదావరి స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందిన ఘటన ధవళేశ్వరంలోని స్థానిక కాటన్ బ్యారేజ్ వద్ద చోటు చేసుకుంది. తన స్నేహితులతో కలిసి స్నానానికి వెళ్లిన కలగా ప్రసాద్ (20) స్నానం అనంతరం వెళ్ళిపోతూ తన చెప్పులకు బురద అంటుకోవడంతో చెప్పులు కడుక్కోవడానికి తిరిగి మరలా గోదావరిలోకి వెళ్లాడు. కడుక్కుంటూ ఉండగా ప్రమాదవశాత్తు గోదావరిలోకి జారిపడి మునిగిపోయి మరణించాడు. ఎస్ఐ ఎం.కేశవరావు కేసు నమోదు చేశారు.

ఇనుప స్తంభం తగిలి వ్యక్తి మరణం

ప్రజాశక్తి-పెదపల్లి

జెసిబితో తరలిస్తున్న ఇనుప స్తంభం తగలడంతో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన ఉసులుమర్రు గ్రామం, నరసాపురం నిడదవోలు మెయిన్ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. ఇసుక డంపింగ్ యార్డ్ వద్ద తణుకు పట్టణానికి చెందిన నేలపాటి అజయ్ కుమార్ (32) బైకుపై తణుకు వైపు వస్తున్నాడు. ఉసులుమర్రు డంపింగ్ యార్డ్ వద్దకు రాగానే జెసిబి డ్రైవర్ ఒక అనువ స్తంభాన్ని తరలిస్తుండగా బైకుపై వెళుతున్న నేలపాటి అజయ్ కుమార్ తలకు తగిలింది. బలమైన గాయం తగలడంతో అతడు సంఘటనా స్థలంలో మతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.సూర్య భగవాన్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-గోపాలపురం

మద్యానికి బానిసైన భర్తలో మార్పు రాకపోవడంతో మనస్తాపానికి గురై నిద్ర మాత్రలు మింగి చికిత్స పొందుతూ వివాహిత మతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోమటిచుటిపుట గ్రామానికి చెందిన పునుగుమాటి రవీంద్ర మద్యానికి బానిసై కుటుంబ పోషణ ఇంటిలో డబ్బులు ఇవ్వడం లేదు. దీంతో భార్య జ్యోతి (28) భర్తను తాగవద్దని పలుమార్లు చెప్పింది. అయినప్పటికీ భర్తలో ఎటువంటి మార్పు రాలేదు. జ్యోతి ఐదేళ్లుగా ఫిట్స్ వ్యాధితో బాధ పడుతోంది. కుటుంబ పోషణ భారంగా మారడంతో భర్తలో ఎటువంటి మార్పు రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యింది. ఇంట్లో ఉన్న మాత్రలు మింగేసింది. ఆమెను మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మతి చెందినట్లు ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురు అరెస్ట్

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామ శివారున పేకాడుతున్నారనే సమాచారంతో ఎస్ఐ వై.గణేష్ కుమార్ తన సిబ్బందితో దాడి చేశారు. వీరిలో ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1200 సీజ్ చేశారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలం మర్లావ గ్రామంలో ఆదివారం ఎస్ఇబి సిఐ కెవి.స్వామి ఆధ్వర్యంలో సారా బట్టీలపై నిర్వహించిన దాడుల్లో 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ వై.నాగేంద్ర కృష్ణ తెలిపారు. దీనికి సంబంధించి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సారా అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు.

రెండు బైకుల చోరీపై కేసుల నమోదు

ప్రజాశక్తి-గండేపల్లి

యల్లమిల్లి గ్రామానికి చెందిన పులపకూర చంద్రరావు తాను పనిచేసే యల్లమిల్లి గ్రామ శివారున పనులు చేస్తూ రోడ్డులో బైక్ పెట్టి బయటికి వెళ్లి వచ్చేసరికి కనిపించలేదు. దీంతో ఆయన ఫిర్యాదుపై వై.గణేష్ కుమార్ కేసు నమోదు చేశారు. గండేపల్లి గ్రామానికి చెందిన ఉప్పులూరి శ్రీనివాస్ తన బైక్‌పై పొలం వెళ్లి అక్కడ పనులు చూసుకుని తిరిగి వచ్చేసరికి తన బైక్ కనిపించలేదు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాదులు

న్యాయవాదుల పాత్ర కీలకం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

రాజ్యాంగ విలువల పరిరక్షణలో న్యాయవాదుల పాత్ర కీలకమైనదని ఐలాజ్ కేంద్ర కమిటీ సభ్యులు బుగతా శివ అన్నారు. ఈ నెల 25న విజయవాడలో జరిగే రాజ్యాంగ విలువల పరిరక్షణ-న్యాయవాదుల పాత్ర అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సు విజయవంతానికై పోస్టర్‌ను ఆయన ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సదస్సుకు ఐలాజ్ జాతీయ కార్యదర్శి కెప్టెన్, మాజీ న్యాయమూర్తులు ఎం.రాజేంద్ర, జేసురత్నం ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. దేశవ్యాప్తంగా రాజ్యాంగాన్ని రక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడుకోవడం కోసం ఐలాజ్ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బండారు నరసింహారావు, కందా వెంకటరాజు, అనూష్క, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బడి ఆటో

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పాఠశాలలు ప్రారంభమయ్యాయి. పుస్తకాలు, యూనిఫారం, లంచ్ బాక్సులు లాంటి వస్తువులు కొనడంలో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వాటన్నింటికంటే ముఖ్యమైనది పిల్లలు పాఠశాలకు చేరే విధానంపై ఎక్కువ మంది తల్లిదండ్రులు ప్రత్యేకమైన శ్రద్ధ చూపడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకుని సంబంధిత వాహనాల యజమానులు వారి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో ఆటోలు ముందు వరుసలో ఉన్నాయి. డబ్బు సంపాదనే తప్ప పిల్లల ప్రాణాల గురించి చాలామంది ఆటో డ్రైవర్లు పట్టించుకోవడం లేదు. ఎంత మంది పిల్లలను ఎక్కిస్తే అంత ఆదాయం వస్తోంది అనే ఆలోచనలోనే డ్రైవర్లు ఉంటున్నారు. ఇదే ప్రమాదాలకు ముఖ్య కారణంగా మారుతోంది. స్కూల్ బస్సుల సమాచారం పూర్తిగా రవాణాశాఖ అధికారుల దగ్గర ఉంటుంది. కాబట్టి వీరు కొంతమేరకు నిబంధనలు పాటిస్తుంటారు. కానీ స్కూల్ ఆటోల సమాచారం అధికారుల వద్ద ఉండదు. ఈ ఆటోలకు రవాణా శాఖ నుంచి ప్రత్యేకమైన అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదు. దీంతో అధికారులు కూడా వీటిని నియంత్రించలేక పోతున్నారు.

ఐదుకు బదులుగాఇరవై వరకూ అతివేగం

జిల్లాలో సుమారు పదివేల ఆటోలు ఉంటాయని అంచనాగా తెలుస్తుంది. ఎక్కువ శాతం ఆటోలు ప్రధాన రహదారుల నుంచి కాక సందుల్లో, చిన్నచిన్న రోడ్ల వెంట పిల్లలను తీసుకెళ్తుండడంతో వీటిపై నియంత్రణ అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఈ పరిస్థితుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యాలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను కుక్కి అతివేగంగా డ్రైవర్లు ఆటోలను తోలుతున్నారు. ఒకవైపు పాఠశాల సమయం ముగుస్తుందని గేటు వేస్తారని ముందు వెనక చూసుకోకుండా దూసుకు వస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. అధికారుల నియంత్రణ లేకపోవడం, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాల నిర్లక్ష్యంతో పాఠశాలల ఆటోలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రైవేట్ బస్సులకు ఫీజులు చెల్లించే స్తోమత లేని కారణంగా తప్పని పరిస్థితుల్లో తమ పిల్లలను ఆటోలో పంపించాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇక పల్లెల నుంచి సరైన బస్సులు లేకపోవడంతో విద్యార్థులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

నిబంధనలు ఇలా..

ఆటోలు, టాటా మ్యాజిక్ వంటి వాహనాలను పాఠశాల విద్యార్థులను తరలించేందుకు జిల్లాలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులను తరలించే వాహనాలకు సంబంధించి ఎప్పటి నుంచో ఉన్న నిబంధనలను ఆటో డ్రైవర్లు పాటించడం లేదు. సాధారణ ఆటోల్లో విద్యార్థులను ఆరుగురికి మించి ఎక్కించకూడదు. టాటా మ్యాజిక్‌లో 10 మందికి మించకూడదు. డ్రైవర్ల పక్కన ఎట్టి పరిస్థితుల్లో కూర్చోపెట్టకూడదు. స్కూల్ ఆటోలకు సైడరాడ్లు తప్పక అమర్చాలి. ప్రతి స్కూల్ ఆటోలో ప్రథమ చికిత్స కిట్లు తప్పనిసరిగా ఉండాలి. ఆటోలకు సంబంధించిన వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు ఎఫ్‌సి సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ తదితరాలు అందుబాటులో ఉంచుకోవాలి. డ్రైవర్ యూనిఫాం తప్పనిసరిగా ధరించాలి. ఈ నిబంధనలు పాటించకుండా పోలీసు, రవాణాశాఖ దాడుల్లో పట్టుబడితే జరిమానాలు భారీగా ఉంటాయని అధికారులు తెలుపుతున్నారు. పిల్లల ప్రాణాలతో చెలగాటమాడే ఓవర్ లోడింగ్‌కు పాల్పడితే భారీ జరిమానాలు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు.

తల్లిదండ్రులు తస్మాత్ జాగ్రత్త

ఆటోలలో డ్రైవర్ సీటుకు అటు, ఇటు, లోపల కాస్త కూడా ఖాళీ లేకుండా విద్యార్థులను ఎక్కించుకుంటున్నారు. అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నప్పటికీ ఆటోల్లో విద్యార్థుల రాకపోకలు మాత్రం ఆగడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత బాధ పడేకంటే తల్లిదండ్రులు ముందే మేల్కొనాలి. బడి పిల్లలను ఆటోలలో స్కూళ్లకు పంపే తల్లిదండ్రులు ఆటోలలో అసలు ఎంత మంది వెళుతున్నారు. ఆటో డ్రైవర్ ఎన్ని ట్రిప్పులు వేస్తున్నారు అనే విషయం ముందుగానే తెలుసుకోవాలి. ఆటో డ్రైవర్ పూర్తి వివరాలు ప్రతి తల్లిదండ్రుల వద్దా ఉండాలి. డ్రైవర్ ఎంత స్పీడ్‌లో వెళ్తున్నాడో, పిల్లలతో ఎలా ప్రవర్తిస్తున్నాడో ఎప్పటికప్పుడు పిల్లలను అడిగి తెలుసుకోవాలి. ఆటో సమాచారాన్ని సంబంధిత పాఠశాలలకు తల్లిదండ్రులే అందించాలి. స్కూల్ యాజమాన్యాలు, సిబ్బంది కూడా వారి స్కూళ్లకు ఎక్కువ మంది పిల్లలను తీసుకువచ్చే ఆటోలను అనుమతించకూడదు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే స్కూళ్లకు చెడ్డపేరు వస్తుందని యాజమాన్యం కూడా గుర్తించాలి. ఆటో ప్రయాణాలపై బాధ్యతగా మెలగాలి.

ఘనంగా మరిడమ్మ ఉత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మరిడమ్మ జాతర సందర్భంగా స్థానిక పాత పెద్దాపురంలో ఆ ప్రాంత ప్రజల ఆధ్వర్యంలో, మరిడమ్మ ఆలయం వద్ద దేవస్థానం ఆధ్వర్యంలో జాగరణ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మరిడమ్మ ఆలయం వద్ద ఈ ఉత్సవాలను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి ప్రారంభించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామ్మోహనరావు ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగిస్తూ జాగరణ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాత పెద్దాపురంలో జరిగిన జాగరణ ఉత్సవంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు ఆర్యేల వీరరాఘవ, విడదాసరి రాజా, ఆకుల కృష్ణ బాపూజీ పాల్గొన్నారు. ఆ ప్రాంత ఉత్సవ కమిటీ సభ్యులు వంగలపూడి సతీష్, గరగ శ్రీను, తామాడ శివ, కోమలి రాజు, లంక గోవిందు, దంగేటి శ్రీను, పెంకే భద్రరావు, పడమటి జగన్నాథం తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన జాగరణ ఉత్సవంలో పలు జానపద కళారూపాలు ప్రదర్శించారు.

ఉత్సవంలో పాల్గొన్న ఎంఎల్ఎ చినరాజప్ప

విధుల్లో భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ భద్రతకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి పని చెయ్యాలని సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ కె.రమేష్ పిలుపు నిచ్చారు. సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో ఆదివారం స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ స్టేషన్ పరిధిలో పని చేసే సిబ్బందితో భద్రతా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు భద్రతకు సంబంధించి వచ్చే సర్క్యులర్లు క్షుణ్ణంగా పరిశీలించి వాటిని అమలు పరచాలన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. విధినిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తెలియ చేయాలని సిబ్బందికి తెలిపారు. ప్రయాణికుల భద్రతే ప్రధాన ధ్యేయంగా పని చేయాలని సిబ్బందిని కోరారు. స్టేషన్ పరిధిలోని సిబ్బంది ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠశాల చెంతనే పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

స్థానిక నీలమ్మ చెరువు దగ్గర మున్సిపల్ ఉన్నత పాఠశాలకు సమీపంలో ప్రమాదం పొంచి ఉంది. రోడ్డుపై ఉన్న కల్వర్టు కుంగింది. పెద్దగుంటలు ఏర్పడి ప్రయాణానికి ఇబ్బందికరంగా మారింది. ఆ మార్గం ద్వారా వాహనదారులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శించారు. నిత్యం అనేక మంది ప్రయాణించే రోడ్డుపై అధికారులు కనీసం ప్రమాద సూచిక బోర్డు కూడా పెట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సామర్లకోట పట్టణ పరిధిలో బలుసులపేట అంబేద్కర్ విగ్రహం సమీపాన తోట గోపాలకృష్ణ మున్సిపల్ పాఠశాలకు అతి సమీపాన మూడు రోడ్లు కూడలిని కలుపుతూ ఉన్న కల్వర్టుకు పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో కల్వర్టు గోతుల్లో గుంటలలో పడి పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. తోట గోపాలకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు వెళ్లే పలువురు విద్యార్థులు సైతం ఈ గుంటలు పడిన కల్వర్టు బారిన పడి గాయాలపాలయిన సంఘటనలు లేకపోలేదు. రాత్రివేళ వర్షాకాలంలో ఈ కల్వర్టు మిగిలిన భాగం కూడా పూర్తిగా పడిపోయే ప్రమాదం ఉంది. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి తక్షణమే శిథిలమైన కల్వర్టుకు మరమ్మతు పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

శిథిలమైన కల్వర్టు

రోహన్‌కు జెఇఇ ఆలిండియా ర్యాంక్

ప్రజాశక్తి - కరప

కరప గ్రామానికి చెందిన వడ్డి రోహన్ శివతేజ జెఇఇ ఆలిండియా స్థాయిలో 2261 ర్యాంకు సాధించి చెన్నై ఐఐటికి సెలెక్ట్ అయినట్లు తల్లిదండ్రులు వడ్డి వెంకటేశ్వరరావు, సత్య కుమారి తెలిపారు. రోహన్ శివతేజ మాట్లాడుతూ చెన్నై ఐఐటిలో సీటు రావడం చాలా గర్వంగా ఉందని, నా శ్రమకు ఫలితంగా ఐఐటిలో నా చిరకాల స్వప్నం నెరవేరిందన్నారు. ఐఐటి పూర్తయ్యాక ఇండియన్ సివిల్ సర్వీస్ సాధిస్తానని ఆకాంక్షను వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

వారాహి యాత్రపై ప్రచారం

ప్రజాశక్తి - కరప

కాకినాడ రూరల్ సర్కవరంలో వారాహి యాత్రను విజయవంతం చేసేందుకు మండలంలోని పంతం నానాజీ ఆటో ప్రచారం భారీ స్థాయిలో నిర్వహించారు. మండలం నుంచి జనసైనికులు వేలాదిగా తరలి వెళ్లారు. కరప మండల నాయకులు బోగిరెడ్డి కొండబాబు, బోగిరెడ్డి గంగాధర్, బండారు మురళీకృష్ణ, గంటా నానిబాబు, యశ్ల పండు, తదితర నాయకుల ఆధ్వర్యంలో జనసైనికులు తరలి వెళ్లారు.

108లో ప్రసవం

ప్రజాశక్తి-మండపేట

గర్భిణిని కాన్పు కోసం 108 వాహనంలో ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో ఆమె ప్రసవించింది. ఈ సంఘటన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానిక గాంధీనగర్ నుంచి శీలం కుమారి గర్భిణి. ఆమెను మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు రావడంతో 108 సిబ్బంది జె.మీరాకృష్ణ, వి.వెంకటేష్‌లు బంధువులు సహాయంతో డెలివరీ చేశారు. సాధారణ ప్రసవం జరిగి మగబిడ్డ జన్మించింది. అనంతరం తల్లి, బిడ్డను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

చిన్నారులకు సైకిల్ అందజేస్తున్న సభ్యులు

డొక్కా సీతమ్మ సేవా సమితి సాయం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన, తోలేటి రేవతి, సాయి లకు రావులపాలెంకి చెందిన డొక్కా సీతమ్మ సేవ సమితి. ఆదివారం సైకిల్, నిత్యావసర సరుకులు, ఫ్రూట్స్ వారికి అవసరమైన సామగ్రిని అందజేశారు. చిన్నారులు చిన్న వయసులోనే తల్లిదండ్రులు అనారోగ్యంతో చనిపోవడంతో అమ్మమ్మ సంరక్షణలో ఉంటున్నారు ఈ చిన్నారులు ఇద్దరు అనారోగ్యంతో బాధపడుతున్నారు ఏ విషయం తెలుసుకున్న డొక్కా సీతమ్మ సేవాసమితి స్పందించి సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డొక్కా సీతమ్మ గారి సేవాసమితి సిబ్బంది బదుగు సుబ్బాయమ్మ వంకీ పాల్గొన్నారు.

యానాం వార్తలు

దరియాలతిప్ప మున్సిపల్ కళ్యాణ మండపం

అధ్వానంగా మున్సిపల్ కళ్యాణ మండపం

ప్రజాశక్తి - యానాం

యానాం దరియాలతిప్పలోని మున్సిపల్ కళ్యాణ మండపం అధ్వానంగా మారింది. కల్యాణ మండపం నిర్వహణ లేకపోవడంతో చెత్తా చెదారం పేరుకుపోయింది. కళ్యాణ మండపం దుస్థితిపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణ మండపం చుట్టూ మొక్కలు పెరిగిపోవడంతో పాములు వస్తున్నాయని మున్సిపల్ యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. కళ్యాణ మండపం నిర్మించినా నేటి వరకూ కనీస సదుపాయాలు ఏర్పాటు చేయలేదని స్థానికులు వాపోతున్నారు. కరెంటు, తాగునీరు ఇతర సదుపాయాలేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కమిటీ బాలయోగి, సబ్బతి శ్రీనివాసరావు, గిడ్ల వెంకన్న, దాసరి బుజ్జి తదితర గ్రామస్తులు మాట్లాడుతూ మండపంలో వెంటనే తగిన సదుపాయాలు కల్పించాలని, నిర్వహణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆడబిడ్డకు రూ.50 వేల పథకం అమలు

పుదుచ్చేరి, కారైకల్, మాహే, యానాంలో ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా పుట్టిన ప్రతి ఆడపిల్లకూ రూ.50 వేలు డిపాజిట్ చేస్తామని పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి ప్రకటించిన పథకం అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కుటుంబంలో ఇద్దరు ఆడపిల్లలకూ రూ.50 వేల చొప్పున డిపాజిట్ చేయడానికి స్త్రీ శిశు సంక్షేమశాఖ నిర్ణయించింది. పథకం అమలుకోసం ఆర్థిక శాఖ అనుమతికి ఫైల్ పంపారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదించగానే అమల్లోకి వస్తుంది.

నేడు మత్స్యకారులతో సమావేశం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జిల్లాలో చేపట్టిన వారాహి యాత్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం కాకినాడలోని ఏటిమొగ ప్రాంతంలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పర్యటించనున్నారు. మత్స్యకారులతో ముఖాముఖి, సమస్యల భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేలా అక్కడ మత్స్యకారులతో మాట్లాడనున్నారు. కాకినాడ సిటీ ఎంఎల్ఎపై తీవ్ర విమర్శలు చేసిన నేపథ్యంలో పవన్ కళ్యాణ్ పర్యటనను భద్రతా కారణాలతో ఆపేస్తారా లేక మత్స్యకారులను కలుస్తారా అనేది సందిగ్ధంగా మారింది.

కప్‌తో విజేతలు

క్రికెట్ ప్రీమియం లీగ్ విజేత 'లోవ లెవెన్స్'

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలోని క్రికెటివెంటి పేరాజు పంతులు, క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రామచంద్రపురం ప్రీమియంలీగ్ (గ్రాండ్ ఫైనల్ లో) రామచంద్రపురం లోవ లెవెన్స్ జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా, రాయల్ చాలెంజర్స్ నిలిచారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సభలో విజేతలకు ట్రోఫీ అందజేశారు. రామచంద్రపురం ప్రీమియర్ లీగ్, సీజన్ వన్ కు సహకరించిన దాతలు కెర్‌టిక్ హాస్పిటల్, అమత రక్త హాస్పిటల్, జీఎస్ ఫ్రెండ్స్ సర్కిల్, హేలిక్స్ స్పోర్ట్స్, విశ్వ చైతన్య శక్తి చారిటబుల్ ట్రస్ట్, రఘురాం, సుధా బజ్జీ, ఫణి ఫ్రెండ్ సర్కిల్ కు కతజ్ఞతలు తెలిపారు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ గాదం శెట్టి శ్రీదేవి, బొప్పన్నల్ జనరల్ సెక్రటరీ గన్నమణి చక్రవర్తి, వార్డు కౌన్సిలర్ తోట అమ్మాజీ తదితరులు పాల్గొని రామచంద్రపురం ప్రీమియంలీగ్‌కు అభినందనలు తెలిపారు.

ఘనంగా ఫాదర్స్ డే

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

బండారులంక గ్రామంలో శ్రీశైలం మాజీ ట్రస్ట్ చింతా శంకరమూర్తి ఇంటి వద్ద ఆయన సతీమణి చంద్రికల ఆధ్వర్యంలో ఆదివారం ఫాదర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తన తండ్రి కడి వీర్రాజు ని ఆయన సోదరి బి.లీలా కుమారి, చింత రేణుక శ్యామల, తమ్ముడు కడి తాతారావు తో కలిసి శాలువా కప్పి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం మాజీ ట్రస్ట్ చింత శంకరమూర్తి, చింత మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కోటి దీపాల చెరువు ఆధునీకరణ

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని నర్సిపూడిలో శ్రీలక్ష్మి నరసింహస్వామి కోటి దీపాల చెరువు రూర పరిధిలో ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని సర్పంచ్ కండిబోట్ల శ్రీను, ఉప సర్పంచ్ చల్లా సుబ్రహ్మణ్యం, ఎంపిటిసి సభ్యులు మెడిశెట్టి సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు పనులను పరిశీలించి, పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలమూరు మండలం రూరా పరిధిలో వెల్లించాన్నారు. దీంతో ముందుగా ఈ గ్రామ అభివృద్ధిలో భాగంగా చెరువు ఆధునీకరణకు రూరా ఆమోదం తెలిపిందన్నారు. ఇందులో భాగంగా చెరువు పూడిక తీత, చుట్టూ వాకింగ్ ట్రాక్ వంటి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఇందుకు సహకరించిన ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డికి వారు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఉపా కేసులు ఎత్తివేయాలని ప్రదర్శన

పెద్దాపురం : అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జాతీయ చైర్‌పర్సన్ విమలక్క, మోహన్ బైరాగిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టిన ఉపా చట్టం కేసులు వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో పెద్దాపురం మండలం గోరింట గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలనకు ఈ కేసులు అద్దం పడుతున్నాయన్నారు. తక్షణమే ఈ కేసులు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వల్లూరి రాజబాబు, బి.రమేష్, ఎఐఎఫ్‌టియు కార్యదర్శి కంచే అంజిబాబు, దేశెట్టి సురేష్, వల్లూరి సత్తిబాబు, వీరబాబు, రాంబాబు, రాజు, చంటి తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీలో అభిషేక్‌కు రజతం

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలోని మోడరన్ కళాశాల విద్యార్థి అభిషేక్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ డబుల్స్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారని కరస్పాండెంట్ జి.వి.రావు తెలియ చేశారు. హర్యానాలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో మోడరన్ విద్యాసంస్థలలో 9 వ తరగతి చదువుతున్న బోను అభిషేక్ బాలుర డబుల్స్ కేటగిరిలో రాణించి బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా పాల్గొంటున్న ప్రతీ పోటీలో విజేతగా నిలుస్తున్న అభిషేక్‌కు జి.వి.రావు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రావు మాట్లాడుతూ ప్రతి టోర్నమెంట్లో అభిషేక్ విజేతగా నిలుస్తున్నాడని, అతని తల్లిదండ్రులకు మోడరన్ విద్యాసంస్థలకు కూడా గొప్ప గౌరవమన్నారు. ఈ విజయ పరంపర అభిషేక్ కొనసాగిస్తూ, ప్రపంచం గర్వించదగిన ప్లేయర్ కావాలని ఆకాంక్షించారు. తనకు ఓ బ్రాంజ్ మెడల్ తో పాటు నగదు పురస్కారం టోర్నమెంట్ నిర్వాహకులు అందజేసినట్లు అభిషేక్ తెలిపారు. ఈ సందర్భంగా అభిషేక్ కి పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయులు,అభినందనలు తెలిపారు.

బ్రాంజ్ మెడల్ తో విజేతలు

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

ప్రజాశక్తి-రావులపాలెం

ఆంధ్రప్రదేశ్ లో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కొత్తపేట మాజీ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ . రాష్ట్రంలో మహిళలకు, చిన్నపిల్లలకు రక్షణ కరువైందనిఅందోళన వ్యక్తం చేశారు. విశాఖ వంటి పారిశ్రామిక నగరంలోనే రక్షణ లేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. చివరకు బికెకి వెళ్లే విద్యార్థులు సైతం రోడ్ మీదకు రావడానికి భయపడుతున్నారని సత్యానందరావు ఆందోళన వ్యక్తం చేశారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఉప్పలవారిపాలెంకు చెందిన అమర్నాథ్ అనే విద్యార్థి హత్య గురికావడం ఆందోళన కలిగిస్తుందన్నారు. హత్యకు గురైన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తే చాలనే రీతిలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను గాలికి వదిలేసిన ఈ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రజల రక్షణ కల్పించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేస్తున్నామని ఆయన అన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-సఖినేటిపల్లి (సల్లజర్ల)

జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, మాజీ ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు నల్లజర్ల మండలంలోని అనంత పల్లి గ్రామంలో మృతుల కుటుంబాలను ఆదివారం పరామర్శించారు. అనంతపల్లి గ్రామానికి చెందిన బోయిన శ్రీను మాతృమూర్తి, గంపల శ్రీను, మాతృమూర్తి, అర్జిల్లి గంగాధరరావు తండ్రి ఇటీవల మరణించారు. దీంతో వీరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట రావూరి వెంకటరమణ, ఏలేటి సత్యనారాయణ, కెంగం శ్రీను, పావులూరి శ్రీను, బొల్లిన బాబి, గన్నమని దుర్గాప్రసాద్, గురుమిల్లి శ్రీను, విప్పిలి వీరరాఘవులు తదితరులు ఉన్నారు.

పరామర్శిస్తున్న నాయకులు

మహారాజశ్రీ 2వ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు రాజమహేంద్రవరం

I.A.No.151/2023, I.A.No.152/2023
I.A.No.153/2023 in O.S.No.17/2023

Between:
1) Vemana Alias Mandapalli Lakshmi Krupakar
2) Mandapalli Vijaya
3) Mandapalli Sagar Sastry
...Petitioners
AND
Sabitha Krupa Grace and Others
...Respondents

R-7: Regani Jayamma, C/o. Late Sathiraju, Hindu, Occupation House Wife, D.No.61-7-11/4, P&T Colony, Near Baba Tample, Rajahmundry RJY JCJC.
R-8: Regani Lakshmi, C/o. Late Sathiraju, Hindu, Occupation House Wife, D.No.61-7-11/4, P&T Colony, Near Baba Tample, Rajahmundry RJY JCJC.

పై నెంబరు పిటీషనులో 7, 8 రెస్పాండెంట్లు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు /నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి పంపుచున్నారు. కావున ది.27-06-2023 సంతం తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరు అయ్యి సదరు పై పిటీషనులో మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల సదరు పిటీషను మీకు వ్యతిరేకముగా విచారించబడునని తెలియజేయడమైనది.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఎస్.శ్రీరామచంద్రమూర్తి
రాజమండ్రి, అడ్వకేట్, శ్యామల నగర్,
19-06-2023. రాజమండ్రి.